ఎన్నికల వేళ..ఆగమాగం కావద్దు

- సంక్షేమ పథకాల ప్రదాత సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి
- ప్రజా ఆశీర్వాద సభలో దానం నాగేందర్

ప్రజలే మాకు బలం: గౌరీశంకర్ కాలనీలో ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న దానం నాగేందర్

బంజారాహిల్స్,నవంబర్ 16: పేదల కష్టాలు తెలిసిన కేసీఆర్‌ను మూడోసారి సీఎంగా చేసుకుంటేనే మరిన్ని సంక్షేమ పథకాలు అందుకునే అవకాశం ఉంటుందని ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని గౌరీశంకర్ కాలనీలో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభలో స్థానిక కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు దానం నాగేందర్. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం ఇబ్బంది పడుతున్న కుటుంబాలకు సాయం చేసేందుకు దేశంలోనే ఎక్కడా లేని విధంగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గెలిపిస్తే మహిళల కోసం సౌభాగ్యలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టనున్నారని , గృహలక్ష్మి కింద నియోజకవర్గంలో 3వేలమందికి రూ.3లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నామన్నారు. ఇప్పటికే సుమారు 3వేలమంది పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు లాటరీ పద్ధతిలో కేటాయించడం జరిగిందని, ఎన్నికలు పూర్తయిన తరువా మరో లక్ష ఇండ్ల నిర్మాణం చేపట్టనున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. రానున్న ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గంలో మరోసారి బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నేత ఫైజల్ జాబ్రి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రాములు చౌహాన్, బస్తీ అధ్యక్షుడు కే.ముత్తు, సతీష్, మహేశ్వర్ రెడ్డి, రాము, ప్రేమ్, జావెద్, జెట్టి విజయ్‌కుమార్, ఆంథోనీ , జయలక్ష్మి, శౌరీరాజు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న స్థానికులు

ఆలోచించి ఓటు వేయాలి

తబేళా బస్తీలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే దానం

బంజారాహిల్స్, నవంబర్ 16 : అన్ని మతాల ప్రజలు సంతోషంగా జీవించే ప్రశాంత హైదరాబాద్ నగరం కావాలా, రాజకీయాల కోసం మతాల మధ్య చిచ్చుపెట్టే పార్టీల పాలన కావాలా అనే విషయాన్ని ఆలోచించి రానున్న ఎన్నికల్లో ఓట్లు వేయాలని ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఖైరతాబాద్ డివిజన్ తబేళా బస్తీలో గురువారం రాత్రి ఎన్నికల ప్రచారానికి వచ్చారు. స్థానికులు ఘన స్వాగతం పలికారు. దారి పొడవునా పూల వర్షం కురిపిస్తూ గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా తబేళాబస్తీలో ఏర్పాటు చేసిన సభలో దానం నాగేందర్ మాట్లాడుతూ పదేండ్ల క్రితం వరకు హైదరాబాద్ అంటే కర్ఫ్యూలు, కత్తిపోట్లు, కరెంటు కష్టాలు గుర్తొచ్చేవని, ముఖ్యమంత్రి కేసీఆర్ సమర్థవంతమైన పాలనలో ప్రస్తుతం హైదరాబాద్ అంటే అభివృద్ధితో పాటు గంగా జమునా తహజీబ్ గుర్తుకు వస్తున్నాయని పేర్కొన్నారు. స్వార్థరాజకీయాల కోసం మతాల మధ్య గొడవలు పెట్టే సంస్కృతి కాంగ్రెస్, బీజేపీలదైతే పేదల ఆకలి తీర్చే మనస్సున్న ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగానే గుర్తించిన కాంగ్రెస్ ఓ వైపు ఉంటే, పేదరికంతో బాధపడే మైనార్టీలకు వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించి, వారికి నాణ్యమైన విద్యనందిస్తున్న బీఆర్ఎస్ పార్టీ రెండో వైపు ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలెటి దామోదర్ గుప్తా, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఫైజల్ జాబ్రీ, హర్షద్, ఖైరతాబాద్ డివిజన్ అధ్యక్షుడు అరుణ్ కుమార్, నాయకులు నాగేశ్వర్ రావు, మెట్టు రాజు, ఎంఎస్ రెడ్డి, త్యాగరాజు, జగన్ దాస్, జహంగీర్‌తో పాటు తబేళా బస్తీ నేతలు మహ్మద్ అఫ్సర్, ఇలియాస్, మహమూద్, రహమత్, మోసిన్, కబీర్, సాబెరా బేగం, రేష్మా బాను తదితరులు పాల్గొన్నారు.

రోడ్ షోలో పాల్గొన్న ఎమ్మెల్యే దానం తదితరులు

నేడు ఖైరతాబాద్‌లో మంత్రి కేటీఆర్ రోడ్ షో

బంజారాహిల్స్, నవంబర్ 16 : ఖైరతాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు మద్దతుగా నేడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ శుక్రవారం నియోజకవర్గంలో రోడ్ షోలో పాల్గొననున్నారు. సాయంత్రం 7గంటలకు బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 5లోని జహీరానగర్ చౌరస్తాలో బంజారాహిల్స్, వెంకటేశ్వరకాలనీ, జూబ్లీహిల్స్ డివిజన్లకు చెందిన ప్రజలను ఉద్దేశించి మంత్రి కేటీఆర్ రోడ్ షోలో ప్రసంగించనున్నారు. అనంతరం హిమాయత్‌నగర్‌లో రోడ్ షో నిర్వహించనున్నారు. హిమాయత్‌నగర్, సోమాజిగూడ, ఖైరతాబాద్ డివిజన్లకు చెందిన ప్రజలనుద్దేశించి కేటీఆర్ ప్రసంగిస్తారు. మంత్రి కేటీఆర్ రోడ్ షోను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే దానం నాగేందర్ కోరారు.

ప్రచారంలో భాగంగా నియోజకవర్గంలోని తబేళబస్తీలో ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు వినూత్నంగా స్వాగతం పలుకుతున్న స్థానికులు, చిత్రంలో కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి తదితరులు – బంజారాహిల్స్

కారెక్కిన కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ నాయకులకు గులాబీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మన్నె గోవర్ధన్‌రెడ్డి

బంజారాహిల్స్,నవంబర్ 16: ఖైరతాబాద్ నియోజకవర్గం బంజారాహిల్స్ డివిజన్ శ్రీరామ్‌నగర్‌కు చెందిన సీనియర్ నేత డాక్టర్ మహ్మద్ సలీమ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. గురువారం నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో సలీమ్‌తో పాటు పలువురు నాయకులు పార్టీలో చేరగా వారికి గులాబీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించడంలో కలిసికట్టుగా పనిచేద్దామని మన్నె గోవర్ధన్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో రాంచందర్, జలాలుద్దీన్, సారంగపాణితో పాటు పార్టీలో చేరిన జావెద్, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మధుమేహ వ్యాధిపై అవగాహన

హిమాయత్‌నగర్,నవంబర్16: నడకతో మధుమేహ వ్యాధి నియంత్రణలో ఉంటుందని ఉస్మానియా దవాఖాన వైద్యుడు రాకేష్ సహాయ్, ఐడియా క్లినిక్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ అన్నారు. వరల్డ్ డయాబెటిస్ డే సందర్భంగా ఐడియా క్లినిక్స్ ఆధ్వర్యంలో గురువారం హైదర్‌గూడలో వాక్‌థాన్ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మధుమేహ వ్యాధి గ్రస్తులు పెరిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మనిషి జీవనశైలి మార్పుల వల్ల అనేక రుగ్మతలతో బాధపడు తున్నారని,అందుల్లో మధుమేహం ఒకటని, ఆహారపు అలవాట్లతో పాటు మధుమేహ వ్యాధి పట్ల అవగాహన పెంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ చెంచిరెడ్డి, డాక్టర్ ఉమా,డాక్టర్ దుర్గాభవానీ,డాక్టర్ పర్లిన్ పాల్గొన్నారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం

హిమాయత్‌నగర్,నవంబర్16: ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని ఓ వృద్ధుడి మృతదేహం లభ్యమైన ఘటన గురువారం నారాయణగూడ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. అడ్మిన్ ఎస్సై నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం హైదర్‌గూడలో ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని ఓ వృద్ధుడు (65) అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు స్థానికులు గుర్తించి 100కు సమాచారం అందించగా ఘటనా స్థలానికి నారాయణగూడ పోలీసులు చేరుకుని 108కు సమాచారం అందించారు. వైద్య సిబ్బంది పరీక్షించగా అప్పటికే మృతి చెందాడు. అనారోగ్య కారణంగానే మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానలోని మార్చురీకి తరలించారు. సంబంధికులు ఎవరైనా ఉంటే 040- 27852579 నెంబర్ ను సంప్రదించాలని సూచించారు.

ముగిసిన వైజ్ఞానిక ప్రదర్శన

బంజారాహిల్స్ రోడ్డు నంబర్10లోని నూర్‌నగర్‌లో లిటిల్ రోజెస్ హైస్కూల్‌లో రెండురోజుల పాటు నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన గురువారం ముగిసింది. విభిన్నమైన థీమ్స్‌తో విద్యార్థులు రూపొందించిన నమూనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. – బంజారాహిల్స్,నవంబర్ 16